# వాల్మీకిరామాయణము

మూలానికి విధేయంగా సరళమైన తెలుగులో



ఉప్పులూరి కామేశ్వరరావు

# వాల్మీకిరామాయణము

మూలానికి విధేయంగా సరళమైన తెలుగులో

ఉప్పులూరి కామేశ్వరరావు

2013

# VALMIKI RAMAYANAM

*BY*

V. KAMESWARA RAO

**COPY RIGHT HELD BY AUTHOR**

PUBLISHER

**V. KAMESWARA RAO**
C-502, Hemadri Towers,
Bagh Ameeri, Kukatpally
HYDERABAD - 500072
040- 23060460

Cover and Layout Design

**K. Ramakrishna**

For Copies

**Sri Jayalakshmi Publications**
2-22-310/97C, Western Hills,
JNTU Post Office,
Kukatpally,
**HYDERABAD - 500072**
040 -23050986

Printed at
**Samhita Graphics**
Ameerpet, **Hyderabad.**
Tel: 040-23731620/ 23741620
**Price : Rs.100.00**

# రామకథాసుధ

**పు**ట్టపర్తి నారాయణాచార్యులుగారు సంస్కృతసాహిత్యం గురించి ఒక ఆసక్తికరమైన మాట చెప్పారు.

సంస్కృతసాహిత్యమనగానే మన మనస్సులో మెదిలే వ్యక్తులిద్దరు. వాల్మీకి, వ్యాసుడు. వాల్మీకి రామాయణమహాకావ్యం రచించాడు. వ్యాసుడు మహాభారతమహేతిహాసం రచించాడు.

మన ప్రాచీనులు విషయాన్ని బేరీజు వెయ్యడంలో మహాప్రవీణులు. పరమ రసజ్ఞులు.

వ్యాసుడు చేసిన పని ఎవరికీ ఊహకు కూడా అందనిది. మనవాళ్ళు వ్యాసుణ్ణి ఎంతగానో పొగిడారు. కడకు 'వ్యాసో నారాయణో హరిః' అని దీర్ఘదండప్రణామం చేసారు. ఎన్ని బిరుదులిచ్చినా 'కవి' అనడానికి మాత్రం జంకారు.

వారి దృష్టిలో కవి అంటే వాల్మీకే. కావ్యం అంటే రామాయణమే.

ఎంత చక్కటి ఆలోచన!

రామాయణాన్ని పరమపవిత్రమైన భక్తివేదంగా పఠించి, పారాయణ చేసి పరవశించి తరించినవారు కొందరు. దానిని మహోత్కృష్టమైన కావ్యంగా అధ్యయనం చేసి పులకించిపోయినవారు కొందరు. ఒక గొప్ప కథగా మాత్రమే చదివి, ఏ మాత్రం ఉత్కంఠ *(సస్పెన్సు)* లేకపోయినా వదలకుండా చదివించిన కథనకౌశలానికి ముగ్ధులైపోయినవారు కొందరు.

ఎవరెలా చదివినా రామాయణం ఈ జాతి హృదయస్పందన. మానవజీవితానికి చుక్కాని. అభ్యుదయపథంలో సాగాలనుకునేవారికి దిక్సూచి.

ఆచార్య పుల్లెల శ్రీరామచంద్రుడుగారు వాల్మీకి హృదయం తెలిసిన ఋషి. వారు నావంటివారికి అనేకమందికి రామాయణం చదివి అర్థంచేసుకునే శక్తినిప్రసాదించిన గురువుగారు. వారు వాల్మీకి రామాయణాన్ని సరళమైన తెలుగులో సంగ్రహంగా 300 పేజీలలో వ్రాయమని నన్ను ఆదేశించారు.

ఇది నా పూర్వజన్మపుణ్యఫలంగా భావించాను. రామాయణాన్ని మరొకసారి పూర్తిగా చదివే అవకాశం వచ్చిందని ఆనందించాను.

ఆచార్య శ్రీరామచంద్రుడుగారు రామాయణం గురించి తరుచు ఒకమాట చెప్తుంటారు. 'రామాయణంలో సహజమైన గొప్ప అందం ఉంది. మనబుద్ధికి తోచినవి దానికి ఆపాదించకుండా చదివితే ఆ కావ్యంలో ఉన్న అందం తెలుస్తుంది.'

నేనామాటని మార్గదర్శకంగా తీసుకున్నాను. వాల్మీకి చెప్పిన కథాక్రమాన్ని కచ్చితంగా అనుసరిస్తూ, సందేశాత్మకవాక్యాలు వదలకుండా, స్వంతభావాలు ఎక్కడా చొప్పించకుండా, మహర్షి ఒరవడి పెట్టిన ప్రవాహినీలక్షణం ఉండేలా వ్రాయడానికి ప్రయత్నించాను.

కొన్ని చోట్ల – అవి చాలా తక్కువే అయినా – కథనం కలిసేందుకు కొన్ని వాక్యాలు *(స్వంతంగా)* వ్రాయవలసివచ్చింది. వాటిని బ్రాకెట్లలో *ఇటాలిక్స్‌లో* పెట్టాను.

ప్రసిద్ధమైన శ్లోకాలు కొన్ని, విషయం ప్రామాణికమని తెలిపే శ్లోకాలు కొన్ని, వాల్మీకి ఒక్కొక్క విషయాన్ని ఎంత సున్నితంగా *(subtle గా)* చెప్తారో తెలియచేసే శ్లోకాలు కొన్ని చేర్చాను. వాటికి అన్వయానుసారంగా తాత్పర్యం కాకుండా కథనంలో ఇమిడే భావం మాత్రమే వ్రాసాను.

ఏమైనా ఇది కొండను అద్దంలో చూపించే ప్రయత్నమే. ఈ ప్రయత్నం చెయ్యడానికి కావలసిన శక్తి ఇచ్చినది శ్రీరామచంద్రుడి కృప. ఆపైన శ్రీరామచంద్రుడిగారి ఆశీర్వాదం. శ్రీరామచంద్రౌ శిరసా నమామి.

దీనిని మిక్కిలి ఓరిమితో అందంగా డి.టి.పి చేసి ఈ గ్రంథానికి పొందికైన రూపం ఇచ్చిన నా అర్ధాంగి ఉమకి కృతజ్ఞుణ్ణి.

హైదరాబాదు **ఉప్పులూరి కామేశ్వరరావు**

8-9-2013

# విషయసూచిక


| | | | |
|---|---|---|---|
| 1. | బాలకాండ | ..................... | 1 |
| 2. | అయోధ్యాకాండ | ..................... | 47 |
| 3. | అరణ్యకాండ | ..................... | 113 |
| 4. | కిష్కింధాకాండ | ..................... | 157 |
| 5. | సుందరకాండ | ..................... | 199 |
| 6. | యుద్ధకాండ | ..................... | 239 |

శ్రీః

# వాల్మీకిరామాయణము

# బాలకాండ

**తపస్స్వాధ్యాయనిరతం తపస్వీ వాగ్విదాం వరమ్,**
**నారదం పరిపప్రచ్ఛ వాల్మీకిర్మునిపుంగవమ్.** 1.1

*(ఈ శ్లోకంతోనే రామాయణమహాకావ్యం ప్రారంభమవుతుంది.)*

పవిత్రమైన వాల్మీకి ఆశ్రమానికి ఒకరోజు ఉదయం దేవర్షి నారదుడు వచ్చాడు. వాల్మీకి ఆ మునిపుంగవుడికి నమస్కరించాడు. ఆహ్వానించి పూజించాడు.

నారదుడు ఉచితాసనంమీద కూర్చున్నాక వాల్మీకి ఆయనకు సమీపంగా నిలబడి వినయంగా ఇలా ప్రశ్నించాడు.

"దేవర్షీ! మీరు ముల్లోకాల సమాచారం తెలుసుకోగల సమర్థులు. భూత భవిష్యత్ వర్తమానాలు తెలిసినవారు. నాకొక చిన్న సందేహం ఉంది. మీకు నివేదిస్తాను.

ఈ లోకంలో, ఇప్పుడు ఎవడైనా మానవుడు –

ధర్మజ్ఞుడు, కృతజ్ఞుడు, విద్వాంసుడూ,

సత్యవంతుడు, సచ్చరిత్రుడు, సమర్థుడూ,

సదాప్రియదర్శనుడు, సర్వప్రాణికోటికీ హితుడూ,

ఆపైన తేజోవంతుడు, ధైర్యవంతుడు, జితక్రోధుడూ *(కోపాన్ని అదుపులో ఉంచుకున్నవాడూ),*

కోపించి రణరంగంలో నిలిస్తే దేవతలు కూడా భయపడేంత పరాక్రమవంతుడూ–

ఉన్నాడా అని తెలుసుకోవాలని చాలా కుతూహలంగా ఉంది. అటువంటివాడు ఉంటే మీకు తప్పక తెలుస్తుంది. దయచేసి చెప్పండి.”

వాల్మీకి ప్రశ్న విని నారదుడు సంతోషించాడు. వాత్సల్యంతో సమాధానం చెప్పాడు.

“వాల్మీకిమహర్షీ! మంచి ప్రశ్న వేసావు.

**బహవో దుర్లభాశ్చైవ యే త్వయా కీర్తితా గుణాః** నువ్వు అనేక సద్గుణాలు చెప్పావు. ఇవన్నీ సాధారణమానవులలో ఉండడం సాధ్యంకాదు.

కాని, నువ్వు చెప్పిన సద్గుణాలు మాత్రమే కాకుండా యింకా అనేక సద్గుణాలు కూడా యిప్పుడు భూలోకంలో ఉన్న ఒక మహాపురుషుణ్ణి ఆశ్రయించి ఉన్నాయి.

అతడి పేరు రాముడు. అతడు కౌసల్యగర్భాన దశరథుడికి పుత్రుడై పుట్టాడు.

రాముడు ధర్మజ్ఞుడు, సత్యసంధుడు, యశస్వి, జ్ఞానసంపన్నుడు, సకలవిద్యా పారంగతుడు, శ్రీమంతుడు.

**పజాపతి సమః శ్రీమాన్ ధాతా రిపునిషూదనః,**
**రక్షితా జీవలోకస్య ధర్మస్య పరిరక్షితా.** 1.13

**రక్షితా స్వస్య ధర్మస్య స్వజనస్య చ రక్షితా,**
**వేదవేదంగతత్త్వజ్ఞో ధనుర్వేదే చ నిష్ఠితః.** 1.14

రాముడు బ్రహ్మతో సమానమైనవాడు. శత్రువులను జయిస్తాడు. తనవారిని రక్షిస్తాడు. జీవలోకం అంతటినీ రక్షిస్తాడు. ధర్మాన్ని పరిరక్షిస్తాడు. స్వధర్మాన్ని పాటిస్తాడు.

అతడు వేదవేదాంగాల తత్త్వాన్నీ గ్రహించాడు. ధనుర్వేదంలో నిష్ణాతుడు.

గాంభీర్యంలో సముద్రమంతటి వాడు. ధైర్యంలో హిమవత్పర్వతమంతటివాడు.

పరాక్రమంలో విష్ణువు. ప్రియదర్శనంలో చంద్రుడు.

కోపిస్తే కాలాగ్ని. ఓరిమిలో భూదేవి.

దానంలో కుబేరుడు. సత్యవాక్పాలనలో అపరధర్మదేవత.

ఇలా అతడి సద్గుణాలు ఎన్నని చెప్పను! ఏమని చెప్పను! ఒక్కమాటలో చెప్పాలంటే సమస్త శుభలక్షణాలూ, సద్గుణాలూ ఆ రాముణ్ణి ఆశ్రయించి ఉన్నాయి.

అతణ్ణి గురించి తెలుసుకోవాలని ఉన్నదన్నావుకదా! విను.

రాముడు దశరథుడి కుమారులలో జ్యేష్ఠుడు. సద్గుణాలలో శ్రేష్ఠుడు. వృద్ధుడైపోయిన దశరథుడు రాముడికి యౌవరాజ్య పట్టాభిషేకం చెయ్యాలనుకున్నాడు.

ఆ రాజు చిన్న భార్య కైకేయి.

రాజు ఆమెకు ఎప్పుడో రెండువరాలు ఇచ్చాడు. రాముడి పట్టాభిషేకపు ఏర్పాట్లు చూసిన కైకేయి ఆ రెండువరాలూ అప్పుడే తీర్చమని పట్టుపట్టింది.

ఆమె కోరిన మొదటివరం: రాముణ్ణి వెంటనే వనవాసానికి పంపాలి. రెండవవరం: భరతుడికి రాజ్యాభిషేకం చెయ్యాలి.

సత్యవాక్నియమం గల దశరథుడు ఆమె కోరిన వరాలు కాదనలేకపోయాడు. తండ్రి ఇచ్చినమాట నిలబెట్టడమే కర్తవ్యంగా భావించి రాముడు వెంటనే వనవాసానికి బయల్దేరాడు.

రాముడి భార్య సీత. ఆమె నారీశిరోమణి. సర్వలక్షణసంపన్న. లోకోత్తర సౌందర్యవతి. అన్నిటినీ మించి రాముడికి ప్రాణసమానమైనది. ఆమెకూడా భర్తతో వనవాసానికి బయల్దేరింది.

రాముడి తమ్ముడు లక్ష్మణుడు. అతడు రాముడికి బహిఃప్రాణం. సోదరభక్తికి నిలువెత్తు నిదర్శనం. సీతారాములను అనుసరించి అతడూ వనవాసానికి బయల్దేరాడు.

సుమంత్రుడు వారిని రథంలో కోసలదేశపు సరిహద్దు దాటించి గంగాతీరంలో ఉన్న శృంగిబేరపురం వద్దకు తీసుకువెళ్ళాడు. సీతారామలక్ష్మణులు గుహుడి సహాయంతో గంగానదిని దాటి అరణ్యాలలో ప్రవేశించారు.

ఒక నదిని దాటి మరో నదీతీరంవరకూ, ఒక అరణ్యం దాటి మరో అరణ్యంలో ప్రవేశిస్తూ కాలినడకన వెళ్తూ వారు ముందుకు సాగారు.

భరద్వాజమహర్షిని సందర్శించి, ఆయన సూచన ప్రకారం చిత్రకూటంలో పర్ణశాల నిర్మించుకుని అందులో దేవగంధర్వులలా సుఖంగా నివసించారు.

అక్కడ అయోధ్యలో రాముడి వియోగం తట్టుకోలేక దశరథుడు మరణించాడు. వసిష్ఠాది ఋషులు భరతుణ్ణి రాజ్యాధిపత్యం స్వీకరించమన్నారు. ధర్మంపట్ల భరతుడి నిష్ఠ అచంచలమైనది. కోసలరాజ్యం రాముడిదే తప్ప తనది కాదనీ, తాను రాముడి సేవకుడిననీ, ఆ రాజ్యానికి రాముడే ప్రభువనీ అతడు ప్రకటించాడు.

రాముణ్ణి చక్రవర్తిలాంఛనాలతో అయోధ్యకు తీసుకువచ్చి పట్టాభిషేకం చెయ్యాలని సంకల్పించాడు. అందుకు తగినట్లు మంత్రిపురోహితులతోనూ, చతురంగ బలాలతోనూ, పురప్రముఖులతోనూ బయల్దేరి చిత్రకూటం చేరాడు.

రాముణ్ణి కలిసి రాజ్యం స్వీకరించమని వేడుకున్నాడు. తండ్రిమాట జవదాటని రాముడికి రాజ్యాపేక్ష లేదు. ధర్మాత్ముడైన భరతుడికీ రాజ్యంమీద వ్యామోహం లేదు. రాజ్యపాలన ఆగకుండా ఉండేందుకు రాముడు తన పాదుకలు భరతుడికిచ్చి, తాను వనవాసం పూర్తిచేసి వచ్చేవరకూ వాటికి ప్రతినిధిగా రాజ్యాన్ని పరిపాలించమన్నాడు.

భరతుడు నందిగ్రామంలో ఉండి ఆ పాదుకలను సేవిస్తూ, రాముడి రాకకు ఎదురుచూస్తూ రాజ్యపాలన చేసాడు.

సీతారామలక్ష్మణులు చిత్రకూటం వదిలి దండకారణ్యంలో ప్రవేశించాడు.

అక్కడ ఎదురైన విరాధుడనే భయంకరుడైన రాక్షసుణ్ణి రాముడు సంహరించాడు. శరభంగమహర్షిని, సుతీక్ష్ణమహర్షిని, అగస్త్యుణ్ణి సేవించాడు. ఆ ఆశ్రమాల్లో ఉండే మునులు తమను రాక్షసుల బారినుంచి రక్షించమని రాముణ్ణి అర్థించారు. రాక్షససంహారం చేస్తాననీ, మునులను రక్షిస్తాననీ రాముడు వాగ్దానం చేసాడు.

ఆ తరువాత జనస్థానంలో ఉండే శూర్పణఖ అనే రాక్షసిని ముక్కూ చెవులూ కోసి విరూపిణిని చేసాడు. ఆమె మాటలు నమ్మి యుద్ధానికి వచ్చిన ఖర దూషణ త్రిశిరస్సులనీ, వారితో వచ్చిన పధ్నాలుగువేలమంది రాక్షసులనీ వధించాడు.

తన అనుచరులని రాముడు వధించాడని విని రావణుడు కోపించి సీతను అపహరించి లంకకు తీసుకుపోయాడు.

ఆమెకోసం వెదుకుతూ వెళ్ళిన రామలక్ష్మణులు వికృతరూపంతో ఉన్న కబంధుడనే భయంకర రాక్షసుణ్ణి వధించి, శబరి ఆశ్రమం చూసి, ఋశ్యమూక పర్వతం చేరారు. అక్కడ సుగ్రీవుడి మంత్రి అయిన హనుమంతుడు వారిని కలిసాడు. రాముడు, సుగ్రీవుడు అగ్నిసాక్షిగా మిత్రులయ్యారు.

రాముడు వాలిని వధించి సుగ్రీవుణ్ణి వానరరాజ్యానికి రాజుని చేసాడు. సుగ్రీవుడు సీతాన్వేషణకోసం వానరవీరులను భూమి నలుదిక్కులకూ పంపించాడు. అందులో దక్షిణదిశకు వెళ్ళినవారిలో హనుమంతుడు వందయోజనాల వెడల్పున్న సముద్రాన్ని లంఘించి లంకకు చేరి సీతను చూసాడు. ఆమెకు రాముడి ఉంగరం యిచ్చి ఊరడించాడు.

తరువాత అశోకవనాన్ని ధ్వంసం చేసి తనను పట్టుకునేందుకు వచ్చిన పంచసేనాగ్ర నాయకులనీ, సప్తమంత్రిపుత్రులనీ, అక్షకుమారుణ్ణీ సంహరించాడు. చివరకు ఇంద్రజిత్తు ప్రయోగించిన బ్రహ్మాస్త్రానికి కట్టుబడిపోయాడు.

రాక్షసులు అతణ్ణి తాళ్ళతోకట్టి రావణుడివద్దకు ఈడ్చుకుపోయారు. మారుతి రావణుడితో మాట్లాడి తరువాత తనను కట్టిన తాళ్ళు తెంపుకుని లంకానగరాన్ని అగ్నికి ఆహుతి చేసాడు. తిరిగి రాముడివద్దకు వచ్చి **"దృష్టా సీతా** – సీతను చూసాను" అని చెప్పాడు.

రాముడు, నలుడనే వానరసేనానాయకుడిచే సముద్రానికి సేతువు కట్టించాడు. వానర సైన్యం సముద్రం దాటి, లంకను ముట్టడించింది. భయంకరమైన యుద్ధంలో రాముడు రావణుణ్ణి సంహరించి విభీషణుణ్ణి రాక్షసులకు రాజుని చేసాడు.

రావణుడి నిర్బంధంలో సంవత్సరం గడిపిన సీతను పరిగ్రహించడానికి సిగ్గుపడి రాముడు ఆమెతో పరుషంగా మాట్లాడాడు. ఆ మాటలు సహించలేక సీత అగ్నిప్రవేశం చేసింది. అగ్నిదేవుడు నిలువెత్తు మంటలనుంచి సీతను క్షేమంగా తీసుకువచ్చి ఆమె ఏ పాపమూ ఎరుగని మహాపతివ్రత అని చెప్పాడు. రాముడు సీతను స్వీకరించాడు.

రాముడు సీతాలక్ష్మణసమేతుడై, మిత్రులందరితో కలిసి పుష్పకవిమానంలో నందిగ్రామం చేరాడు. అక్కడ జటలు విసర్జించి వనవాసవ్రతం పూర్తిచేసాడు. అయోధ్య చేరి పట్టాభిషిక్తుడై పదకొండువేల సంవత్సరాలు ప్రజారంజకంగా పరిపాలన చేసాడు.

ఈ కథను రామాయణం అంటారు. పవిత్రమైన యీ కథను విన్నా, చదివినా సమస్త పాపాలు నశిస్తాయి. పుణ్యఫలాలు లభిస్తాయి."

*(అలా నారదుడు రామకథ క్లుప్తంగా చెప్పాడు. ఇది రామాయణ మహాకావ్యంలో మొదటిసర్గ. దీనినే 'సంక్షేపరామాయణం' అనీ 'బాలరామాయణం' అనీ అంటారు.*

*ఈ కథ విన్న వాల్మీకీ, శిష్యులూ ఆనందించారు. వారి పూజలందుకుని నారదుడు ఆకాశమార్గంలో బ్రహ్మలోకానికి వెళ్ళాడు.)*

* * *

నారదుడు వెళ్ళేసరికి మధ్యాహ్నం కావస్తోంది.

వాల్మీకి ఆశ్రమానికి సమీపంలో తమసానది ఉంది. మధ్యాహ్నవిధులు నిర్వర్తించడానికి వాల్మీకి భరద్వాజుడనే శిష్యుడిని వెంటబెట్టుకుని తమసానదీతీరానికి వెళ్ళాడు. అక్కడ ఒక మంచి రేవు చూసుకున్నారు. శిష్యుడితో, "భరద్వాజా! ఈ రేవు చూడు. సత్పురుషుడి మనస్సులా ఎంత నిర్మలంగా ఉందో కదా! మనం ఈ రేవులోనే స్నానాదికాలు కానిద్దాం. నీ చేతిలో ఉన్న కలశం కిందపెట్టి నారచీర అందించు." అన్నాడు.

భరద్వాజుడు అందించిన నారచీర తీసుకుని చుట్టూ ఉన్న వనశోభను చూసాడు. ఆ రేవుకు సమీపంలో అన్యోన్యానురక్తితో ఒక్కటై చెవులకు ఇంపుగా కూస్తున్న క్రౌంచపక్షుల జంటను చూసాడు.

అంతలోనే ఒక బోయవాడు మగపక్షిని బాణంతో కొట్టాడు. అది రక్తసిక్తమై నేల కూలింది. తన ప్రియుడు దుర్మరణం పాలవడంతో ఆడపక్షి గోడుగోడున విలపించింది. క్షణం క్రితం వరకూ పరవశించి కువకువలాడుతూ చేసిన పక్షికూత ఒక్కసారిగా రోదనగా, వియోగవేదనగా మారిపోయింది.

క్రౌంచికి పట్టిన దుఃస్థితి మహర్షి మనస్సుని కలిచివేసింది. బోయవాడిమీద పట్టరాని కోపం వచ్చింది. ఆ కోపం శాపమై, ఒక శ్లోకమై ఆయన నోటినుంచి వెలువడింది.

**శ్లో. మా నిషాద ప్రతిష్ఠాం త్వ**
**మగమః శాశ్వతీః సమాః,**
**యత్ క్రౌంచమిథునాదేక**
**మవధీః కామమోహితమ్.** 2.15

"ఓరీ! కామపరవశమై ఉన్న క్రౌంచమిథునంలోని ఒక పక్షిని నిష్కారణంగా చంపావు కదరా! *(ఇంత ఘోరానికి ఒడిగట్టిన)* నువ్వు కూడా ఇక ఎక్కువకాలం జీవించవు."

వాల్మీకి, శిష్యుడు స్నానసంధ్యావందనాలు పూర్తిచేసుకున్నారు. ఆశ్రమానికి తిరిగి వస్తూంటే ఆ శ్లోకమే మహర్షి మనస్సులో తిరుగుతోంది.

"భరద్వాజా! పక్షిదుఃఖం చూసి నేనూ దుఃఖించాను. ఆ శోకంలో నా నోటినుంచి వచ్చిన వాక్యం చూడు. ఇది నాలుగు పాదాలతో, ఒక్కొక్క పాదానికి ఎనిమిదేసి అక్షరాలతో, వీణవంటి వాద్యాల సహకారంతో లయబద్ధంగా పాడుకునేందుకు అనువుగా ఉంది. శోకంనుంచి వచ్చిన ఈ వాక్యం శ్లోకం అనే పేరుతో ప్రసిద్ధమౌతుంది." అన్నాడు.

ఆశ్రమం చేరి తన నిత్యకృత్యాలు చేసుకుంటున్నా ఆ శ్లోకమే ఆయన మనస్సంతా నిండిపోయి ఉంది. అనుకోకుండానే దానిని మననం చేసుకుంటున్నాడు.

అంతలో చతుర్ముఖబ్రహ్మ ఆయన ఆశ్రమానికి వచ్చాడు. వాల్మీకి ఆశ్చర్యచకితుడై అత్యంత భక్తిశ్రద్ధలతో బ్రహ్మదేవుణ్ణి పూజించాడు. ఆసనం సమర్పించి వినయంగా నిలుచున్నాడు. అయినా ఆయన మనస్సు **మా నిషాద**.... అనుకుంటూనే ఉంది.

వాల్మీకి అవస్థ గమనించి బ్రహ్మ నవ్వుతూ ఇలా అన్నాడు.

"మహర్షీ! నువ్వు పలికినది శ్లోకమే. నా సంకల్పమే నీనోటివెంట ఆ శ్లోకం పలికించింది. ఉదయం నారదుడు చెప్పిన రామకథని కమనీయమైన కావ్యంగా చెప్పు.

సీతారామలక్ష్మణులు, రాక్షసులు, ఇతరులూ చేసిన ప్రవర్తనలు, వారి మనస్సులలో రహస్యంగా మెదిలిన ఆలోచనలూ అన్నీ నీకు స్పష్టంగా తెలిసేలా వరం యిస్తున్నాను.

**శ్లో. న తే వాగనృతా కావ్యే కాచిదత్ర భవిష్యతి,**
**కురు రామకథాం పుణ్యాం శ్లోకబద్ధాం మనోరమామ్.** 2.35

పుణ్యప్రదం, మనోహరం అయిన రామకథని శ్లోకబద్ధం చేసి ఒక కావ్యంగా రూపొందించు. నీ నోటినుంచి అసత్యం రాదు.

**శ్లో. యావత్ స్థాస్యన్తి గిరయః సరితశ్చ మహీతలే,**
**తావద్రామాయణకథా లోకేషు ప్రచరిష్యతి.** 2.36

ఈ లోకంలో పర్వతాలు నిలిచి ఉన్నంతకాలం, నదులు ప్రవహించినంతకాలం నువ్వు రచించే రామాయణం ప్రజలమధ్య ఉంటుంది. అంతకాలం నేను సృష్టించిన ఊర్ధ్వ అధో లోకాల్లో ఎక్కడ కావాలంటే అక్కడ నువ్వు స్వేచ్ఛగా సంచరిస్తూ ఉండగలవు."

ఈ మాటలు చెప్పి బ్రహ్మ అంతర్ధానమయ్యాడు. వాల్మీకీ, శిష్యులూ ఆశ్చర్యపోయారు. ఆనందంతో పులకించిపోయారు.

అందరినోటా ఆ శ్లోకమే వినిపిస్తోంది. ఆశ్రమమంతా ఆ శ్లోకమే మారుమోగుతోంది. చదివినకొద్దీ మళ్ళీ చదవాలనిపిస్తోంది. విన్నకొద్దీ మళ్ళీ వినాలనిపిస్తోంది. చదువుతున్న కొద్దీ కొత్త కొత్త అందాలు సంతరించుకుంటోంది.

వాల్మీకి అదే శ్లోకవృత్తంలో రామాయణం రచించాలని నిర్ణయించాడు. ప్రాచీనాగ్రాలుగా *(కొసలు తూర్పు వైపు ఉండేలా)* దర్భలు పరుచుకొన్నాడు. వాటిమీద కూర్చుని ఆచమించి

అంజలి ఘటించాడు. బుద్ధిని ఏకాగ్రం చేసి యోగదృష్టితో కథలోనివారి ప్రవర్తనలన్నీ చూసాడు. వారి ఆలోచనలు తెలుసుకున్నాడు. మొత్తం రామాయణ వృత్తాంతమంతా కరతలామలకమైంది.

రామకథని కావ్యంగా మలుచుకునేందుకు మహర్షి మనస్సులో ప్రణాళిక సిద్ధమయింది.

**శ్లో. కామార్థగుణసంయుక్తం ధర్మార్థగుణవిస్తరమ్,**
**సముద్రమివ రత్నాఢ్యం సర్వశ్రుతిమనోహరమ్.** 3.8

లోకాభిరాముడైన రాముడి చరిత్ర రత్నాఢ్యమైన *(రత్నాలతో నిండిన)* సముద్రం వంటిది. దానిని కామార్థగుణసంయుక్తంగా *(అర్థకామాల గురించి చెప్పేదిగా),* ధర్మార్థగుణవిస్తరంగా *(ధర్మాన్ని గురించి విస్తారంగా చెప్పేదిగా),* సర్వశ్రుతిమనోహరంగా *(వినేవారికి వీనులవిందుగా)* మహర్షి రచించాడు.

ఇరవైనాలుగువేల శ్లోకాలతో ఉన్న ఈ కావ్యాన్ని ఐదువందల సర్గలుగా విభజించాడు. వీటిని ఆరుకాండలుగా ఏర్పరిచి వాటికి బాలకాండ, అయోధ్యాకాండ, అరణ్యకాండ, కిష్కింధాకాండ, సుందరకాండ, యుద్ధకాండ అని పేర్లు పెట్టాడు.

ఇది అంతవరకూ జరిగిన రామకథ. ఆ తరువాత జరుగబోయే కథకి ఉత్తరకాండ అని పేరుపెట్టాడు.

దీన్ని నేర్చుకునేందుకు అత్యంతయోగ్యులు ఎవరా అని ఆలోచించాడు.

అంతలో ఆ ఆశ్రమంలోనే ఉన్న సీతమ్మ కుమారులు కుశలవులు మహర్షి పాదాలు పట్టి నమస్కరించారు. వారు సాంగవేదాధ్యయనం చేసారు. అంతేకాక గానకళాకోవిదులయ్యారు.

తాను వేదోపబృంహణంగా *(వేదాలలో చెప్పిన మంచిమాటలు సామాన్యజనులకు చేరేలా కూర్చిన)* రామాయణాన్ని నేర్చుకునేందుకు అంతకంటే యోగ్యులు వేరెవరూ లేరని నిర్ణయించుకుని వాల్మీకి వారికి ఆ కావ్యాన్ని ఉపదేశించాడు.

**శ్లో. కావ్యం రామాయణం కృత్స్నం సీతాయాశ్చరితం మహత్,**
**పౌలస్త్యవధమిత్యేవ చకార చరితవ్రతః** 4.7

మహర్షి తన కావ్యానికి 'రామాయణమ్', 'సీతాయాశ్చరితం మహత్' 'పౌలస్త్యవధమ్' అని మూడు పేర్లు పెట్టాడు. కుశలవులు ఆ కావ్యాన్ని **వాచోవిధేయంగా** *(అంటే కంఠస్థంగా)*

**End of Preview.**

**Rest of the book can be read @**

**[http://kinige.com/book/Valmiki+Ramayanamu](http://kinige.com/book/Valmiki+Ramayanamu)**

* * *